సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 30 । మే । 2023



నష్టపరిహారం అందించాలి
కోనరావుపేట(వేములవాడ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని లంబాడీ ఐక్యవేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు నరేశ్‌కుమార్ కోరారు.



'విస్తరి'స్తున్న ఉపాధి
ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రామోజిపేటలో ఏ ఇంటికి వెళ్లినా విస్తరాకులు కుడుతూ కనిపిస్తుంటారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ధర్మగుండంలోకి శుభ్రమైన నీరు



ధర్మగుండంలో శుభ్రమైన నీరు

సాక్షి ఎఫెక్ట్

వేములవాడ: రాజన్న ధర్మగుండంలోకి స్వచ్ఛమైన నీటిని నింపారు. ధర్మగుండంలోని నీళ్లు పచ్చబడ్డాయని 'సాక్షి' ఇటీవల ప్రచురించగా ఆలయ అధికారులు స్పందించారు. అపరిశుభ్ర నీటిని తొలగించి స్వచ్ఛమైన గోదావరి జలాలతో నింపారు.

బాలాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణాన్ని రూ.1.80కోట్లతో చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఈక్రమంలో స్వామివారి విగ్రహాలను భద్రపరచడానికి బాలాలయాన్ని నిర్మించాలని వేదపండితులు నిర్ణయించారు. బాలాలయ నిర్మాణానికి సోమవారం స్థలాన్ని పరిశీలించారు. పశువుల సంతలోని ఖాళీస్థలంలో బాలాలయం నిర్మించి, అందులో స్వామికి నిత్యపూజలు నిర్వహిస్తారని తెలిపారు. పండితులు నవీన్‌చారి, రఘురామ శర్మ, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి, ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మేగి నర్సయ్య, బండారి బాల్‌రెడ్డి, నర్సింలు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాగర్జన విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. తంగళ్లపల్లిలో సోమవారం ప్రజాగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. గుంటి వేణు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. నిరుద్యోగభృతి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతులకు రుణమాఫీ, దళితబంధు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. నాయకులు మంచికట్ల రమేశ్, అజ్జ వేణు, సోమ నాగరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, చంద్రం, బాలరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణ సదనం ప్రారంభోత్సవానికి తరలిరండి



మాట్లాడుతున్న సుమలత శర్మ

గంభీరావుపేట(సిరిసిల్ల): హైదరాబాద్‌లోని గోపన్నపల్లెలో రూ.16కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ సదనాన్ని ఈనెల 31న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ సభ్యురాలు సంకెపల్లి సుమలతశర్మ తెలిపారు. జిల్లాలోని బ్రాహ్మణులు ప్రారంభోత్సవానికి అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. రాష్ట్ర నాయకులు సుధాకర్ శర్మ, మాధవరావుశర్మ, శ్రీనివాస్‌శర్మ, కుమార్ శర్మ, శరత్‌చంద్ర ఉన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట పీహెచ్‌సీలో ఫిజియోథెరపీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ బాబు కోరారు. ఆయన మాట్లాడుతూ.. కాలిపాదం, కండరాలు బలపడడానికి, కీలు కదలికలు పెంచడానికి, భుజం బలపడడానికి ఫిజియోథెరపీ ఉపయోగపడుతుందన్నారు. కండరాల నొప్పి నుంచి ఉపశమనం ఉంటుందన్నారు.

'దశాబ్ది' సంబురాలు

- పదేళ్ల పండుగకు సన్నద్ధం
- జూన్ 2 నుంచి 22 వరకు వేడుకలు
- అంగరంగ వైభవంగా నిర్వహించేలా ప్రణాళిక



తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా సిరిసిల్లలో మహిళలు నిర్వహించిన భారీ ప్రదర్శన

సిరిసిల్ల: సబ్బండ వర్ణాలు ఏకమై నినదించిన వేళ.. సకల జనులు ఉద్యమించిన తరుణాన.. అందరి నినాదం తెలంగాణమైంది. ఆత్మగౌరవ నినాదం హోరెత్తింది.. జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనమంటూ... పాటలు పలవించాయి. దశాబ్దాల కల నెరవేరింది. తెలంగాణ స్వరాష్ట్రం సాకారమైన వేళ.. యావత్తు తెలంగాణ ప్రజానీకం పులకించింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లాలో దశాబ్ది ఉత్సవాలకు అధికారులు అన్ని సిద్ధం చేస్తున్నారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు 21 రోజులపాటు సంబురాలు నిర్వహించనున్నారు. మరో దశాబ్ద కాలం పాటు తెలంగాణ సాధనోద్యమం ప్రజల మనసుల్లో నిలిచిపోయేలా వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలకు రూపకల్పన చేసింది.

ప్రగతిని చాటేలా..

పదేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధిని ప్రజల కళ్ల ముందుంచుతూ.. వేడుకలను నిర్వహించాలని భావిస్తోంది. తొలి రోజు జూన్ 2న జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దశాబ్ది ఉత్సవ సందేశాన్ని మంత్రి కేటీఆర్ అందించనున్నారు. జిల్లా సాధించిన ప్రగతిని కేటీఆర్ వివరిస్తారు. ఇందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు 21 రోజులపాటు వివిధ ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతిని, ప్రజలకు దరిచేరిన సౌకర్యాలను, వసతులను వివరిస్తూ పదేళ్లలో వచ్చిన మార్పును ప్రజల ముందుంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ శాఖల వారీగా కార్యక్రమాలు రూపొందించారు. ప్రభుత్వ శాఖల్లో వచ్చిన సంస్కరణను కరపత్రాలు, ఫ్లెక్సీల రూపంలో ప్రజలకు తెలియజేయాలని భావిస్తున్నారు. కొత్త జిల్లాలు, కొత్త మండలాల ఏర్పాటు, కొత్త గ్రామ పంచాయతీలు, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఆవిర్భావం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. చివరి రోజు 22వ తేదీన స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు జిల్లాలో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న పోడుభూములకు పట్టాలను ఇవ్వడం, తెలంగాణకు హరితహారం వంటి కార్యక్రమాలను దశాబ్ది ఉత్సవాల్లో భాగం చేస్తున్నారు. తొలిరోజు జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మంత్రి కేటీఆర్ పాల్గొంటున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో..

రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ సంబరాలు, దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్‌లోనూ వివరించారు. జిల్లాలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ.. పదేళ్ల పండగను విజయవంతం చేయాలని భావిస్తున్నారు. అన్ని శాఖల వేడుకలను కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు, దశాబ్ది ఉత్సవాలను జిల్లా ప్రజల హృదయాల్లో పదిల పరచుకునేలా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నారు.



కలెక్టరేట్



ఎస్పీ కార్యాలయం

ప్రగతి అందరికీ తెలిసేలా వేడుకలు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతి అందరికీ తెలిసేలా వెలుగెత్తి చాటాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. అరుణ మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని మరోసారి ప్రజలకు గుర్తు చేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావంతో చేరువైన పాలన, కొత్త మండలాలు, కొత్త గ్రామపంచాయతీలు, వ్యవసాయం, సాగునీటి రంగం, విద్యుత్ విభాగాల్లో వచ్చిన మార్పులు ప్రజలకు వివరించాలన్నారు. ప్రజాప్రజాప్రతినిధులు 20 రోజులపాటు వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేడుకలు నిర్వహించాలని కోరారు. దశాబ్ది ఉత్సవాల ప్రణాళికను కలెక్టర్ వివరించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది ఉత్సవాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వేడుకల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ అనురాగ్ జయంతి వివరించారు. ఏఎస్పీ చంద్రయ్య, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

సార్లూ.. పట్టించుకోండి

- ప్రజావాణికి అర్జీల వెల్లువ
- కలెక్టరేట్‌కు తరలివచ్చిన దరఖాస్తుదారులు
- అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్
- 53 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి బాధితులు వెల్లువలా వస్తున్నారు. సార్లూ.. పట్టించుకోండి.. అంటూ వేడుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో బాధితులు కలెక్టరేట్ బాట పడుతున్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నా రు. ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దన్నారు. మొత్తం 53 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ ఉన్నారు.

భూములకు రక్షణ కల్పించండి



సిరిసిల్ల శివారులోని సర్వేనంబర్ 168/8లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూములు ఇచ్చింది. ఆ భూములనే ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. కొందరు వ్యక్తులు భూమికి సంబంధించి సర్వే నోటీసులు ఇచ్చి అక్కడికి వెళ్లమన్నారు. ఇక్కడికి రావద్దంటూ బెదిరిస్తున్నారు. అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయండి.
– చంద్రంపేట ఒడ్డెర కులస్తులు

నష్టపరిహారం అందించాలి



ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించండి. పంట నష్టపోయిన రైతులకు రూ.10వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇంత వరకు మంజూరు చేయలేదు. ధాన్యం కొనుగోళ్లను జూన్ 2లోగా పూర్తి చేయాలి. – లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు నరేష్ నాయక్

గూడు కల్పించండి



మాది సిరిసిల్ల నా పేరు వేముల లత. నా భర్త దాదాపు 13 ఏళ్ల క్రితం మరణించాడు. నాకు చెవులు వినపడవు. బీవైనగర్‌లో ఉన్నప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ డ్రాలో పేరు రాలేదు. ఇటీవల నాకూతురికి రెండు కాళ్లు చచ్చుబడి నడవడం లేదు. నా కూతురి పరిస్థితి చూసి ఎవరు ఇంటిని కిరాయికి ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి నాకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించి నన్ను నా కూతురిని కాపాడండి. – బాధితురాలు లత

రుణాలు మంజూరు చేయాలి



గత ఆరేళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రుణాలు మంజూరు కావడం లేదు. రుణాల కోసం చాలా మంది ఎస్సీ, ఎస్టీ యువత ఎదురుచూస్తుంది. కానీ ప్రభుత్వం రుణాలను మంజూరు చేయకుండ కాలయాపన చేస్తుంది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీ రుణాలను మంజూరు చేసి యువతకు స్వయం ఉపాధి కల్పించాలి.
– రామచంద్రం, తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

పాస్‌బుక్‌లో భూమిని నమోదు చేయండి



నా పేరు బడే స్వామిదాసు మాది కోనరావుపేట మండలం కనగర్తి. ఏడేళ్లుగా సర్వే నంబర్ 346లో 32 గుంటల భూమిని సాగుచేస్తూ జీవనం పొందుతున్నాను. ఈ 32 గుంటల భూమిని పాస్‌బుక్‌లో నమోదు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం. – బడే స్వామిదాసు

ఉద్యోగం, భూమి ఇప్పించాలి

- కలెక్టరేట్‌కు వచ్చిన జవాన్ భార్య



అడిషనల్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న జవాన్ భార్య

సిరిసిల్లఅర్బన్: జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ పబ్బాల అనిల్ కుటుంబ సభ్యులు సోమవారం అడిషనల్ కలెక్టర్‌ను కలిశారు. అనిల్ భార్య సౌజన్య తన ఇద్దరు కుమారులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. ఏదైన ఉద్యోగం, వ్యవసాయభూమి కేటాయించాలని, కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకోగా.. అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు అనిల్ కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం పరంగా వచ్చే బెనిఫిట్స్ అందజేస్తామని, అన్ని రకాల న్యాయం చేస్తామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే

- డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాస్‌రావు

సిరిసిల్ల: జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు ఇంటింటి సర్వేలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.శ్రీనివాస్‌రావు కోరారు. సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్‌లో సోమవారం బూత్ లెవల్ ఆఫీసర్ల(బీఎల్‌వో)తో సమావేశమయ్యారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 2023 అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికీ ఓటుహక్కును కల్పించాలన్నారు. జూన్ 23వ తేదీ వరకు ఇంటింటి సర్వేలు నిర్వహించి ఫారం–6 దరఖాస్తులను తీసుకోవాలని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా ఫారం–8 తీసుకోవాలని సూచించారు. సిరిసిల్ల తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, నాయబ్ తహసీల్దార మనోజ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.





రాజన్నకు జనజాతర



దీక్షావోకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్న సన్నిధి సోమవారం జనజాతరను తలపించింది. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో సోమవారం 30 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. జిల్లా విద్యాధికారి రమేశ్ కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, మై వేములవాడ ట్రస్టు సభ్యులు మధు మహేశ్, చర్లపల్లి రామకృష్ణ, ప్రతాప సంపత్ ఉన్నారు.

'కట్టా'పై సస్పెన్షన్ వేటు..!

- 'సాక్షి' కథనాలపై స్పందించిన ఈఎన్‌సీ
- కట్టా విష్ణువర్ధన్ నియామకం, విద్యార్హతలపై ఆరోపణలు
- సస్పెన్షన్ ఉత్తర్వులను స్వయంగా అందజేసిన ఏఈ
- సర్వీస్ రిమూవల్, సాలరీ రికవరీకి డిమాండ్
- 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడని వెల్లడి



విష్ణువర్ధన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్(ఇంజినీరింగ్)శాఖలో కలకలం రేగింది. విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈగా ఉన్న కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసుపై సస్పెన్షన్ పడింది. అతని నియామకం జరిగిన తీరు, విద్యార్హతలపై ఉన్న వివాదాలు, సర్వీసు రికార్డులో ఉన్న ఫోర్జరీ సంతకాల ఆరోపణలు వెరసి అతడిపై కొంతకాలంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చే నడుస్తోంది. అతని వ్యవహారంలో జరిగిన అక్రమాలపై 'సాక్షి' కొంత కాలంగా ఆధారాలతో వరుసగా పరిశోధనాత్మక కథనాలు అందిస్తోంది. స్పందించిన హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం ఆదివారం సాయంత్రం అతడిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్ని విచారణలు వేసినా..

విష్ణువర్ధన్‌పై సాక్షి కథనాలతో హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం జనవరిలోనే విచారణకు ఆదేశించింది. ఆ జిల్లా అధికారులు విచారణ చేసిన నివేదిక సమర్పించినా దానిపై ముందడుగూ పడలేదు. పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ మైనార్టీ ఉద్యోగి చక్రం తిప్పి చర్యలు తీసుకోనివ్వలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ తాము కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సమయంలోనూ సదరు విశ్రాంత అధికారి అడ్డుకున్నాడని మండిపడుతున్నారు. 'సాక్షి'లో అతని విద్యార్హతలు, సర్వీసు రికార్డులో సంతకాల ఫోర్జరీ విమర్శల వరకు అన్ని ఆధారాలతో వరుసగా కథనాలు ప్రచురితం కావడంతో ఇటీవల సచివాలయంలో విచారణ చేపట్టారు. అక్కడా విచారణ ప్రభావితమైందన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో కొందరు సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు విషయాన్ని చేరవేశారని, జాప్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతోనే ఈఎన్‌సీ కార్యాలయం కట్టా విష్ణువర్ధన్‌పై సస్పెన్షన్ వేటు వేసిందని సమాచారం.

నిర్మల్ నుంచి ప్రత్యేకాధికారి

కట్టా విష్ణువర్ధన్ ఆది నుంచి వివాదాస్పద అధికారే. అతడి గురించి తెలుసుకున్న ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఆర్డర్స్‌ను జాగ్రత్తగా అతడికి చేరవేశారు. సాధారణ ప్యూన్‌లు, క్లర్కులు, ఇతర ఉద్యోగులతో ఇచ్చి పంపిస్తే విష్ణువర్ధన్ తీసుకునే అవకాశాలు తక్కువ అని గ్రహించిన ఉన్నతాధికారులు ఏఈ ర్యాంకు అధికారితో ఆదివారం ఆదేశాలను పంపించారు. నిర్మల్ సబ్ డివిజన్‌లో పనిచేసే సదరు అధికారి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలను పట్టుకుని సెలవుదినమైనప్పటికీ ఆదివారం కరీంనగర్ చేరుకున్నారు. 'కట్టా'ను ఆఫీసుకు పిలిపించి సస్పెన్షన్ ఆర్డర్స్ అందజేసి, రిసీవ్డ్ కాపీ మీద సంతకాలు కూడా తీసుకుని వెళ్లారు. అతనిపై క్రమశిక్షణ చర్యలు కొలిక్కి వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఆదేశాలు అమలవుతున్న కాలంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని వీడకూడదని స్పష్టం చేశారు.

ఏం జరిగింది..?

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు 2 మార్చి 1967లో జన్మించాడు. అతడి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకటనాగరత్నాచారి మరణించారు. తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవపూర్‌లో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరాడు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ 01 ఫిబ్రవరి 1956గా ఉంది. కానీ, విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో 02 మార్చి 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడంటూ అందరి కళ్లకు గంతలు కట్టాడు. నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద నాన్ టెక్నికల్ పోస్టులో చేరాల్సిందిగానీ టెక్నికల్ పోస్టులో చేరడం గమనార్హం. సర్వీసు రికార్డులో ఉన్న సంతకాలు ఫోర్జరీ అన్న ఆరోపణలు దుమారానికి కారణమయ్యాయి. పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్లలో పనిచేసిన ఇతను ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు.

సాలరీ రికవరీ చేయాలి



కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో ఏళ్లుగా వివాదం సాగుతోంది. 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కప్పిన అతనిపై సస్పెన్షన్ వేటు పడటం శుభపరిణామం. అక్రమంగా విధుల్లో చేరిన అతడిని సర్వీసు రిమూవల్ చేసి, అతనికి ఇంతకాలం ప్రభుత్వం అందజేసిన సాలరీని అధికారికంగా రికవరీ చేయాలి. అతనిపై క్రిమినల్ కేసులు బుక్ చేసి, అరెస్టు చేయాలి.
– ఆమీర్, సామాజిక కార్యకర్త

క్లుప్తంగా

ర్యాంకర్లకు విద్యాధికారి ప్రశంసలు



రాష్ట్ర స్థాయి ర్యాంకర్లును అభినందిస్తున్న డీఈవో రమేశ్

సిరిసిల్లకల్చరల్: వివిధ పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను జిల్లా విద్యాధికారి రమేశ్ అభినందించారు. స్థానిక యోగీశ్వర ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాలిసెట్, టీఎస్ఆర్‌జేసీ ప్రవేశపరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వి.ప్రీతి పాలీసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, ఎం.జశ్వంత్ టీఎస్ఆర్‌జేసీ పరీక్షలో రాష్ట్ర స్థాయి ఆరో ర్యాంకు సాధించారు. యోగీశ్వర ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు గూడూరి నిశాంత్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కు వేములవాడ రాజన్న జట్టు



వేములవాడ రాజన్న జట్టును అభినందిస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ : రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విజయ్ ఆనంద్ గ్రౌండ్‌లో జరుగుతున్న దేవాలయాల ప్రీమియర్ లీగ్-2023 క్రికెట్ జట్ల పోటీల్లో వేములవాడ రాజన్న జట్టు యాదగిరిగుట్ట, ఖమ్మం జట్లపై గెలిచి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న జట్టును ఈవో కృష్ణప్రసాద్ అభినందించారు. వైస్ క్యాప్టెన్‌గా ఒన్నారం భాస్కర్, వికెట్ కీపర్‌గా సుధాకర్, ఆల్ రౌండర్లుగా అరుణ్, శివసాయి, పి.వంశీ, పి.సిద్ధూ, పవన్‌కల్యాణ్, బాజు, రాము, రాజు, లక్ష్మణ్ ప్రతిభ కనబర్చినట్లు క్యాప్టెన్ మహేశ్ తెలిపారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సిబ్బంది విధుల్లో సమయ పాలన పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చిప్పలపల్లికి చెందిన దివ్య కుమారుడు హిమాన్షు కోతి దాడిలో గాయపడ్డాడు. హిమాన్షును తీసుకొని తల్లి పోతుగల్ పీహెచ్‌సీకి సోమవారం ఉదయం వచ్చింది. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో అక్కడే ఉన్న స్వీపర్ బాలమ్మను అడిగి వివరాలను తెలుసుకుంది. ఉదయం 9.20 దాటినా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి హిమాన్షుకు చికిత్స అందించింది. దీనిపై హెచ్ఈవో యాదగిరిని వివరణ కోరగా నిత్యం వైద్యసేవలు అందిస్తామని, సిరిసిల్లలో సమావేశం ఉన్నందున ఉద్యోగులు అందుబాటులో లేరని తెలిపారు. మరోసారి ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో ప్రజల సౌకర్యార్థం కోసం రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ..కాలనీవాసులు సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు విన్నవించారు.160కి పైగా డబుల్ బెడ్‌రూంలు ఉండగా, సుమారు 600 మంది నివాసముంటున్నారని, వారంతా నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ జయంత్‌కుమార్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

‘విస్తరి’స్తున్న ఉపాధి

- విస్తార్లకు కేరాఫ్ రామోజీపేట
- వేసవిలో చేతినిండా పని
- ఉదయం అడవిబాట.. సాయంత్రం ఇంటివద్దే పని

ఇల్లంతకుంట(మానకొండూర్): వరికోతలు పూర్తయ్యాయి.. ఉపాధి పనులు సైతం లేవు.. మండుటెండల్లో పల్లె ప్రజలకు విస్తరాకులు కుడుతూ ఉపాధి పొందుతున్నారు. ఏ పనీపాట లేని వేసవికాలంలో పల్లె మహిళలకు నిత్యం చేతినిండా ఉపాధి దొరుకుతుంది. తెల్లవారుతుండగానే గుట్టకు వెళ్లి మోదుగు ఆకులను సేకరించి తీసుకొస్తారు. నాలుగైదు రోజులు ఎండబెట్టిన తర్వాత మహిళలు విస్తరాకులు కుడుతారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని చాలా గ్రామాల్లో విస్తరాకులు కుడుతూ మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఇల్లంతకుంట మండలం రామోజీపేటలోని మహిళలు నిత్యం విస్తరాకులతో ఉపాధి పొందుతున్నారు.



విస్తార్లు కుడుతున్న మహిళలు

రెండు నెలలు.. చేతినిండా పని

రామోజీపేటకు చెందిన దాదాపు 200 మంది మహిళలు మోదుగు ఆకులను సేకరించి నిత్యం విస్తరాకులు కుడుతున్నారు. వేసవిలో వ్యవసాయ పనులు ఉండకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారొద్దనే ఉద్దేశంతో కొన్నేళ్లుగా ఈ గ్రామ మహిళలు ఇదే పని చేస్తున్నారు. రెండు నెలలపాటు విస్తరాకులు కుట్టి ఉపాధి పొందుతున్నారు. గ్రామంలోని ఏ ఇంట్లోకి వెళ్లిన విస్తరాకుల కట్టలే కనిపిస్తుంటాయి.

పేపర్ ప్లేట్లతో తగిన గిరాకీ

గతంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు మోదుకు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను వినియోగించే వారు. గత పదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. ప్రతీ శుభకార్యంలో బంతి భోజనానికి స్వస్తి చెప్పి టేబుల్‌సిస్టమ్ భోజనాలను పెడుతుండడంతో విస్తరాకులకు గిరాకీ తగ్గింది. పేపర్‌ప్లేట్ల వాడకం ఎక్కువవడంతో ప్రతి శుభకార్యంలో వాటినే వినియోగిస్తున్నారు. ఒక్కో విస్తారాకు కట్టలో వంద వరకు విస్తర్లు ఉంటాయి. ఒక్కో కట్ట అమ్మితే రూ.50 నుంచి రూ.60 మాత్రమే వస్తాయని మహిళలు చెబుతున్నారు.

వేములవాడలో విక్రయం

రామోజీపేట గ్రామ మహిళలు కుట్టిన విస్తరాకులను వేములవాడకు ఆటోలో తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. మార్కెట్‌లో గిరాకీని బట్టి ధర వస్తుందని వారు చెబుతున్నారు. ప్రభుత్వం తమకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ఆదుకుంటే మరింత ముందుకెళ్తామని పేర్కొంటున్నారు.

ప్రభుత్వం చేయూతనివ్వాలి



మా ఊరిలో దాదాపు రెండు వందలకు పైగా ఎండకాలంలో విస్తరాకులు కుడుతుంటారు. వ్యవసాయ పనులు ఉండకపోవడంతో ఇంటి దగ్గర తీరిగ్గా ఉండలేక కుటుంబ పోషణకు ఈ పనిచేస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తే ఇంకా ముందుకెళ్తాం.

– ఈదుల్ల పుష్ప, రామోజీపేట

పేపర్ ప్లేట్లతో గిరాకీ తగ్గింది



చాలా కాలంగా మా ఊరిలో వందలాది మంది వస్తరాకులు కుడతారు. చుట్టుపక్కల ఊరిలో ఎక్కడ కూడా విస్తరాకులు కుట్టరు. కుట్టిన విస్తరాకులను ఆటోలో వేములవాడకు తీసుకెళ్లి అమ్ముతాం. పేపర్ ప్లేట్ల వాడకం ఎక్కువ కావడంతో మోదుగు ఆకుల విస్తర్లకు గిరాకీ తగ్గింది.

– పందుల లలిత, రామోజీపేట

వట్టిగా ఉండకుండా..



వానాకాలం, యాసంగిలో వరినాట్లు వేయడానికి, పత్తి చేనులో కలుపు, పత్తి తీయడానికి వెళ్తాం. ఎండాకాలంలో రెండు నెలలు ఏం పని ఉండది. చాలా ఏళ్లుగా ఎండాకాలంలో వట్టిగా ఉండకుంటా విస్తరాకులు కుడుతున్నాం. గుట్టకు పోయి ఆ కులు తెచ్చి, ఎండబెట్టి, విస్తర్లు తయారు చేస్తాం. మా ఊరిలో చాలా మంది విస్తరాకులు తయారు చేస్తారు. – రేగుల బాలవ్వ, రామోజీపేట

మలేసియాకు పంపిస్తామని మోసం

- రూ.6 లక్షలకు టోకరా
- సిరిసిల్లలో కేసు నమోదు

సిరిసిల్లక్రైం: మలేషియాకు పంపిస్తామని చెప్పి పలువురి దగ్గర డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వారిపై సిరిసిల్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన దూష రమేశ్ విదేశాలకు వెళ్లాలని సిరిసిల్లలోని వాసవినగర్ ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ దార్నం శ్రీనివాస్‌ను కలిశారు. శ్రీనివాస్ తనకున్న పరిచయాలతో 15 మంది నుంచి పాస్‌పోర్టులు, రూ.6 లక్షలు సేకరించి మలేషియాకు పంపేందుకు చెన్నైకి చెందిన మణికందన్, శరవణన్‌ను సంప్రదించి డబ్బులు పంపించారు. వారు ఆన్‌లైన్‌లో వీసాలు పంపించారు. సదరు వీసాలను పరిశీలించగా నకిలీవిగా తేలడంతో మోసపోయామని గమనించిన దూస రమేశ్ సోమవారం చెన్నైకి చెందిన మణికందన్, శరవణన్‌లపై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు ముగిశాయి. వివరాల్లోకి వెళ్తే.. నిమ్మపల్లికి చెందిన అనుముల ఓదెలు, అతని సోదరుడు లింగారెడ్డి, లింగారెడ్డి కుమారుడు నాగరాజు కలిసి ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొలనూర్ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఓదెలు, నాగరాజు మృతిచెందగా, లింగారెడ్డికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కాగా ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించారు.

లారీలు లేక ఇబ్బంది పడుతున్నాం

- అదనపు కలెక్టర్‌ను కలిసిన సింగిల్‌విండో ఛైర్మన్లు

సిరిసిల్ల: తూకం వేసిన ధాన్యం ఎక్కడికక్కడ నిల్వ ఉన్నాయని.. లారీలు రాకపోగా.. రైస్‌మిల్లుల్లో అన్‌లోడింగ్ అవుతలేవని జిల్లాలోని సింగిల్‌విండో చైర్మన్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను సోమవారం కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయన్నారు. రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతుంటే యాసంగి వడ్లు కొనుగోళ్లు సగం కూడా పూర్తికాలేదన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపాలని, అన్‌లోడింగ్ వేగంగా అయ్యేలా చూడాలని కోరారు. వేములవాడ ప్రాంతంలో కొనుగోళ్లు మరీ మందకొడిగా సాగుతున్నాయని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్దాపూర్ గోదాములను ఖాళీ చేయించి వడ్లు తరలించేలా చూస్తామని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం తరలిస్తామని, కొంచెం ఓపిక పట్టాలని కోరారు. సింగిల్‌విండో చైర్మన్ల ఫోరమ్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, చైర్మన్లు బండి దేవదాస్, ఏనుగు తిరుపతిరెడ్డి, బండ నర్సయ్యయాదవ్, రామ్మోహన్‌రావు, కృష్ణారెడ్డి, కిషన్‌రావు, సల్మాన్‌రెడ్డి ఉన్నారు.



అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసిన జిల్లాలోని సింగిల్ విండో చైర్మన్లు

కత్తితో పొడిచి.. గొంతునులిమి

- భర్తను హత్య చేసిన భార్య, కొడుకు
- దాచారం గ్రామంలో ఘటన
- భూమి అమ్మిన డబ్బుల విషయంలో గొడవ
- ఐదేళ్లుగా దూరం..బిడ్డ పెళ్లిలో ఒక్కటయ్యారు
- ఇరవై రోజులకు హత్య చేశారు

ఇల్లంతకుంట(మానకొండూర్): కట్టుకున్న భార్య... కన్న కొడుకే కసాయివాళ్లుగా మారారు. భూమి అమ్మిన డబ్బులు ఇవ్వడం లేదని భర్తను భార్య, కొడుకు కలిసి కత్తితో పొడిచి.. గొంతి నులిమి హత్య చేశారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన దర్పల్లి శంకర్(55) వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. భార్య చంద్రకళ, ఇద్దరు కూతుళ్లు మౌనిక, మమత, కుమారుడు వంశీకృష్ణతో కలిసి ఐదేళ్లకు పైగా భర్తకు దూరంగా సిద్దిపేటలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈనెల 5వ తేదీన పెద్ద కూతురు మౌనిక వివాహం చేసేందుకు స్వగ్రామం వచ్చి భర్త శంకర్‌తో కలిసి ఉంటున్నారు. పెద్ద కూతురు వివాహం జరిపించారు. కొన్ని నెలల క్రితమే చిన్నకూతురు మౌనిక ప్రేమవివాహం చేసుకుంది. శంకర్ రెండెకరాల వ్యవసాయ భూమిని విక్రయిస్తే రూ.46 లక్షలు వచ్చాయని.. కూతురు పెళ్లి చేయగా మిగిలిన డబ్బులు కావాలని భార్యభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈక్రమంలో ఆదివారం రాత్రి తండ్రీ కొడుకులు శంకర్, వంశీకృష్ణ మధ్య డబ్బుల విషయం గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య చంద్రకళ, కుమారుడు వంశీకృష్ణ కలిసి శంకర్‌పై కత్తితో పొట్ట భాగంలో దాడి చేశారు. అంతటితో ఆగకుండా వంశీకృష్ణ గొంతు నులుమడంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం శంకర్ హత్య విషయం బయటకు రావడంతో ఎస్సై రాజేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి సోదరి సుగుణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై రాజేశ్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఉపేందర్

బిడ్డ పెళ్లికి ఒక్కటై... డబ్బుల కోసం హత్య ?

ఐదేళ్లుగా దూరంగా ఉంటున్న చంద్రకళ–శంకర్ దంపతులు పెద్ద కూతురు మౌనిక వివాహం కోసమే ఒక్కటయ్యారు. బిడ్డ పెళ్లి చేయగా మిగిలిన డబ్బులు తమకు ఇవ్వాలని భార్య, కుమారుడు పట్టుబట్టడం.. శంకర్ ససేమిరా అనడంతోనే ముగ్గురి మధ్య గొడవ ముదిరి హత్యకు దారితీసిందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆ ఐదు ఫుల్ బాటిళ్లు ఎక్కడివి ?

శంకర్‌కు మద్యం తాగే అలవాటు ఉందని, ఆదివారం ఐదు ఫుల్ బాటిళ్లు తెచ్చుకొని.. ఫుల్లుగా తాగి తమతో గొడవపడ్డాడని, తనను చంపేందుకు కత్తి దగ్గర పెట్టుకున్నాడని మృతుడి భార్య పోలీసుల ముందు చెప్పినట్లు తెలిసింది. గ్రామస్తుల వాదన ఇలా ఉంది శంకర్ ఎవరితో గొడవ పడే వ్యక్తి కాదని, వ్యవసాయం చేసుకుంటూ జీవించే వాడంటున్నారు. అసలు ఆ ఐదు మద్యం బాటిళ్లు తెచ్చుకోవాల్సిన అవసరం అతడికి ఏముందని, పథకం ప్రకారమే అందరిని నమ్మించేందుకే భార్య, కొడుకు మద్యం బాటిళ్లను ఇంట్లో పెట్టి ఉంటారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

శంకర్ భార్య చంద్రకళ, కుమారుడు వంశీకృష్ణను పోలీసులు ఉదయాన్నే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నేడో, రేపో అరెస్టు చూపే అవకాశం ఉంది.

మృతదేహాన్ని పరిశీలించిన సీఐ

శంకర్ మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీలో సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ పరిశీలించారు. సీఐ ఉపేందర్ మాట్లాడుతూ శంకర్‌ను హత్య చేసిన భార్య, కుమారుడిని పట్టుకుని హత్యకు గల కారణాలను తెలుసుకుని, త్వరలోనే అరెస్టు చూపనున్నట్లు చెప్పారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వేములవాడ : పట్టణంలోని వెంకటరమణ పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. స్కూల్ కరస్పాండెంట్ చిలుమల కుమారస్వామి మృతిచెందగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అధ్యాపకులు యెల్ల పోచెట్టి, పారువెళ్ల శ్రీనివాస్, శివకుమార్, సాంబశివుడు, నరహరి శర్మ, రంగారావులతోపాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముస్తాబాద్ : మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. 2001–02 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఉపాధ్యాయులు ఆగంరెడ్డి, పాండురంగం, సదానందం, శర్మ, శేఖర్, బైరి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ప్రభావతి, భాస్కర్, లచ్చయ్య, రామకృష్ణ, పూర్వ విద్యార్థులు రాజు, లక్ష్మణ్, భానుచందర్, శ్రవణ్, సుమన్, రమేశ్, శ్రీను, లత, భాగ్యమ్మ, మాధవి, అరుణ,రాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

సిరిసిల్లక్రైం: విధి నిర్వహణలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 20 కేసుల్లో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన 54 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేదారేశ్వర ఆలయ అభివృద్ధిపై పట్టింపేది?



కేదారేశ్వర స్వామి ఆలయంపై ఉన్న రావి చెట్టు

వేములవాడ: రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన కేదారేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజులపాటు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు ఆలయంపై రావి చెట్టు ఏపుగా పెరుగుతున్నా తొలగించడం లేదని, ఆలయ గోడలు ప్రమాదకరంగా మారినా పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదని వాపోతున్నారు. కాలనీకి చెందిన భక్తులు ఆలయంలో పనులు చేపడుతున్నారని, కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. అధికారులు ఇప్పటికైనా కేదారేశ్వర ఆలయం అభివృద్ధిపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్ట్ చేయాలి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క

సిరిసిల్ల: రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పతకాలు సాధించి దేశానికి వన్నె తెచ్చే మహిళా మల్లయోధులను లైంగికంగా వేధిస్తున్నట్లు తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్న బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను బీజేపీ ప్రభుత్వం కాపాడడం దారుణమన్నారు. ఢిల్లీలో 36 రోజులుగా ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. అరెస్ట్ అయిన క్రీడాకారులను వెంటనే విడుదల చేయాలన్నారు.



విమలక్క

కారును ఢీకొన్న ఫైరింజన్

- తృటిలో తప్పిన ప్రమాదం

సిరిసిల్లక్రైం : కారును ఫైరింజన్ ఢీకొనగా తృటిలో ప్రమాదం తప్పింది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్లి సోమవారం మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. సిరిసిల్ల కలెక్టరేట్ చౌరస్తా వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఫైరింజన్ ఢీకొట్టింది. దీంతో కారు వెనుకభాగం పూర్తిగా దెబ్బతింది. కారులో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. ఫైర్ ఇంజన్‌ను అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. దీంతో వారు ఫైర్ ఇంజన్ డ్రైవర్ యాదయ్య, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



దెబ్బతిన్న కారు వెనుకభాగం

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి–మర్రిగడ్డ గ్రామాల మధ్య సోమవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చందుర్తికి చెందిన లింగంపల్లి తిరుపతి తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వేములవాడకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. తిరుపతి కాళ్లు విరిగి, తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

పార్కులో చిన్నారిపై కుక్క దాడి

- ఆందోళనకు గురవుతున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దెచెరువు వద్ద గల పార్కులో సోమవారం ఓ చిన్నారిపై కుక్క దాడి చేసింది. గ్రామస్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పార్కులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో పార్కులో ఆడుకుంటున్న భాగ్యనగరం సాన్విక(08) అనే బాలికపై కుక్క దాడి చేసింది. గాయపడ్డ చిన్నారిని వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే చిన్నారులపై కుక్కలు దాడి చేస్తున్నట్లు సాన్విక మేనమామ ప్రశాంత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.






లాల్‌బహదూర్ స్టేడియంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల క్రీడాకారులు

చీఫ్ మినిస్టర్స్ కప్.. మనోళ్ల మార్చ్‌ఫాస్ట్

కరీంనగర్ స్పోర్ట్స్: చీఫ్ మినిస్టర్స్ కప్–2023 రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ముందుగా జరిగిన మార్చ్‌ఫాస్ట్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులు తమ ప్లకార్డులు, ఫ్లాగ్‌లతో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.